కథానిక

# కళారాధన

వి. యస్. అవధాని

సంసారం ఒక కూటం. ఆ కూటం కేవలం ఒక ఏర్పాటు మాత్రమే. ఆ ఏర్పాటును భార్యాభర్తలు ఎంత నిర్లిప్తంగా భావించగలిగితే అంత ఆనందం లభిస్తుంది. కాని నిర్లిప్తత డబ్బు కల వారి మాక్కుభుక్తంగా అనేక కారణాలవల్ల ఒక్కొక్కసారి మారుతూంటుంది. కాని, ఈ కూటాన్ని నిజంగా అర్థంచేసుకున్న స్త్రీ పురుషులు సంసారాన్ని ఒక ఏకాంకికగా స్వీకరిస్తారు.

... ... ...

ఎండాకాలం అసమర్థుని ఆక్రోశంలా భగ భగ మంటోంది. వచ్చేపోయే కార్లు లారీల కాకి కూతల ప్రతిధ్వనుల్లో బొయిబొయి మంటున్నాయి. శాస్త్రి నడుస్తున్నాడు—

రోడ్డే అతణ్ని వెక్కిరిస్తోంది.

పన్నెండు గంటలయినా ఇంటికి వెళ్ళాలని అతనికి అనిపించడంలేదు. ఇంట్లో గోల పడలేక కాదు. ఇంటి ఇల్లాలు "ఏం తెచ్చా"వని అడుగుతుందని కాదు. ఇంట్లో చేయాలిసిన- చేయగల పని లేకకాదు. కాని శాస్త్రికి ఇంటికి వెళ్ళాలని లేదు. ఇంటికి ఎందుకువెళ్ళాలి అని కాని, ఎందుకు వెళ్ళకూడదు అని గాని అతను ఆలోచించడం లేదు.

నడుస్తున్నాడు. ఆలోచిస్తూ నడుస్తున్నాడు. అందరూ హడావుడిగా అటూ ఇటూ పోవడం కొంచెం తగ్గింది. కాని శాస్త్రి మాదిరివాళ్లు కొంత మందికీ, కార్లలోపోయే తాహతున్న కొంత మందికీ, వీస్తున్న వడగాలి తెలియడంలేదు.

శాస్త్రి అనుకుంటున్నాడు. తను అసమర్థుడు కాదు. తన కుంచె ఎన్నో దృశ్యాలను ఉన్న వాటిని ఉన్నట్టుగా గీస్తుంది. ఎవరూ చూడని దృశ్యాలను తనకుంచె వాళ్ళ కళ్ళయెదుట ప్రత్యక్షం చేస్తుంది. తన ఈ బలహీనతే శశిని ఆకర్షించింది. శశి భాగ్యవంతులపిల్ల. అయినా ఏరి కోరి కాలేజీజీవితంలో తన్ని వరించింది. ఆ కోరికను తను కాదనలేదు. కాదనక పోయినందున ఈ నాడు తనకు గలిగిన నష్టం ఏమీ లేదు. ఆ ప్రథమ పరిచయం నాడు తనకు శశిపట్ల ఎంత గౌరవమూ, కాంక్షా ఉన్నాయో ఈనాడూ అంతే ఉన్నాయి.

శశికీ అంతే. శశి చక్కగా పాడుతుంది. ఆమెగానం విని తను ఎన్నో రాత్రులు ఆకలిని మరచిపోయి నిద్రించాడు. శశి భాగ్యవంతుల పిల్లయినా తనవారిని ఎదిరించి శాస్త్రితో జంట కూడినందున ఆమెకూ శాస్త్రితో పాటు దారిద్ర్యం దాపరించింది. అయినా ఒక్కనాడు కూడా శాస్త్రిమీద ఆమె విసుక్కోదు. అదే శాస్త్రికి భరింపరాని దవుతోందేమో.

శాస్త్రి చిత్రాలు చూడడానికి రోజూ ఎంత మందో స్నేహితులు వస్తారు. వారంతా "నీ చిత్రాలు చాలా బాగున్నాయి" అంటారు. కొంతమంది అతణ్ణి ఏదన్నా సినీమాలో చిత్రకారుడుగా చేరమని సలహా ఇస్తారు. కాని ప్రయత్నించి ఎన్నిసార్లో విఫలు డయాడు.

ఇంకా నడుస్తూనే ఉన్నాడు...ఆకలవుతోంది. జేబులో దమ్మిడీ లేదు. సహజంగా ఒకర్ని అప్పు అడిగేవాడు కాకపోయినా, ఈ నాలుగేండ్ల నుంచీ చాలా కాఫీహోటళ్ళలో అప్పు పెట్టాడు. ఒక్కొక్కసారి శశి తన దగ్గరి ఏదో ఒక నగను అమ్మకు వచ్చేది. ఆ డబ్బులో కొంత బలవంతంగా శాస్త్రి జేబులో ఉంచేది. దాంతో వీలయినన్ని అప్పులు తీర్చేవాడు. కాని అది కూడా క్రిందటి నెలతో అయిపోయింది. హోటల్ అయ్యరు నిష్కర్షగా అప్పు ఇవ్వనని అనడు. కాని అడిగితే తనేం చెయ్యాలి? ఎప్పుడు ఇస్తానని చెప్పాలి? బాధతే అలవాట్లవుతున్నాయి. ఇవంతా తనెందుకుగాను సహిస్తున్నట్టు? సహించక చేసే దేమిటి? ఎక్కడయినా గుమాస్తా ఉద్యోగం చెయ్యవచ్చు. కాని రంగులు కల

పదం తెలిసిన తన బుర్ర కూడికలూ తీసివేతలూ చెయ్యలేదు. గీతలు గీయడం నేర్చిన తన చేతులు అక్షరాలు రాయలేవు. తన కేం చేతనవును? ఏమీ చేత కాదు.

ఆలోచిస్తూ ఇస్నా అంటూ నడుస్తూనే ఉన్నాడు. బాటవెంబడి చెట్లు ఉన్నాయి. వాటి నీడ తనకు కొంతలో కొంత హాయి నిస్తోంది. ఎదురుగా ఒక బిచ్చగాడు "ఒక కానీ ఇవ్వండయ్యా..." అంటున్నాడు. ఎందుకో అక్కడ ఆగబుద్ధి అయింది. ఆగాడు. తనూ ఒక బిచ్చగాడేనా? ఛా, ఛా, తను బి. ఏ. చదువుకున్నవాడు. పైజామాలూ, పొడుగు లాగూలు వేసుకునేవాడు. తను బిచ్చగాడేమిటి? ప్రక్కని హోటల్లోంచి ఒక సూట్‌వాలా బయటికి వచ్చాడు-

"ఓ శాస్త్రీ..."

"హల్లో అలీ..."

"కులాసాగా ఉన్నావా?"

"...అదే కులాసా -"

"శశి నీవద్దనే ఉన్నదిగా?"

"...ఆ...ఉన్నది. ఇప్పుడేం చేస్తున్నావ్?"

"చెప్తా రా..." అని కారులోకి తీసుకువెళ్ళాడు. కారు పోతోంది. శాస్త్రికి ఆకలి తగ్గకుండా పోతోంది.

"నేను ఊర్వశీ ఫిలిమ్స్..."

"అవును, అపుడు 'స్టార్ట్' చేశావు. తరువాత ఏమయింది?"

"ఒక సంస్కృత పండితుని చిత్రం తీశాను. చిత్రం చాలా బాగా తయారయింది. మొదట్లో లక్ష రూపాయిలు చాలనుకున్నా. కాని చివరికి ఆరు లక్ష లయింది. అయితే ఏంలే. ఆరవ దేశంలో ఆడుతోంది, దాదాపు డబ్బంతా రావచ్చు..."

"ఇప్పుడేం చేస్తున్నావు?"

"మానాన్న వ్యాపారం ఉందిగా- అందులోనే ఉంటున్నా."

"మీనాన్న వ్యాపారం టెక్కాసీలోగా?"

"అవును. కాని కొన్ని కారణాలవల్ల ఇక్కడ ఉండాలిసొచ్చింది."

ఇంతలో కారు ఆగింది.



వాహినీ వారి రాబోవు తెలుగుచిత్రం "గుణసుందరి కథ" లో అభినేత్రి శ్రీరంజని

ఆదొక పెద్ద బంగాళా. అలీ తనూ కాలేజీలో స్నేహితులు. అలీ మంచి ఆటగాడు. చదువులో శుంఠ. అయినా శాస్త్రి చలవవల్ల మూడు పార్టులూ ఒకసారే అయినా యనిపించి హాయిగా ప్రపంచంలో విహరిస్తున్నాడు.

ఇద్దరూ ఒక పెద్ద సోఫామీద కూర్చున్నారు. ఫాన్ గిరగిరా తిరుగుతోంది. కిటికీలకు వ్రేలాడుతున్న వట్టివేళ్ళ తడకలమీద కుర్రాడు నీళ్ళు చల్లుతున్నాడు.

"స్నానం చేస్తావా?" అన్నాడు అలీ.

"ఇప్పుడు చెయ్యను. కాని నేను..."

"ఆదేం కుదరదు. భోజనం అయితేనేకాని నిన్ను వెళ్ళనివ్వను."

"ఇంటిదగ్గర శశి..."

"ఈ ఒక్కపూటకి శశి ఏమీ అనుకోదు" అంటూ అలీ టేబిల్ దగ్గరికి పోయాడు. తప్పక శాస్త్రికూడా పోవాలిసి వచ్చింది. భోంచేస్తూండగా — బంగాళా తన రెండోభార్యకోసం కొన్నాననీ, అదిగాక ఇంకా కొంతపొలం కూడా కొన్నాననీ, తన కూతురుకి శాస్త్రి ట్యూషన్ చెప్పాలనీ- నెలకు వందరూపాయిలిస్తాననీ- అలీ అన్నాడు. శాస్త్రి అప్రయత్నంగా సరేనన్నాడు. కాని తరువాత చాలా బాధపడ్డాడు. రోజూ వాళ్ళ

యింటికిపోయి ఆ అమ్మాయికి ఏం చదువు చెప్తాడు? భోజనా లయ్యాయి. పాన్ సేవిస్తూ అలీ అన్నాడు: "శాస్త్రీ, ఇపుడే ట్యూషన్ మొదలు పెట్టు. అయినంతే చెప్పు."

"అలీ... నేను ఏం చదువు చెప్పగలను!" అని శాస్త్రి అంటూంటే, "కన్నెప్పా" అని అలీ పిలిచాడు. ఒక అయ్యరు తన కృత్రిమ వేషంతో హాజరయ్యాడు. అరవంలో అలీ ఏదో చెప్పాడు.

అయిదు నిమిషాలలో ఒక పదేండ్ల బాలిక వెండి పళ్లెంలో కొన్ని పండ్లూ, కొన్ని తమల పాకులూ తీసికొనివచ్చింది. అవి ఒక స్టూలుమీద పెట్టి ఆ బాలిక లోపలికి పోయింది. మళ్లీ నోటు బుక్కు తీసికొనివచ్చి శాస్త్రికెదురుగా నిలబడింది. శాస్త్రి ఏదో పాఠం చెప్పినట్లే చెప్పాడు. ఒక గంట అయ్యాక శాస్త్రి వెళ్ళబోతుంటే అలీ లుంగీతో ప్రత్యక్షమయి, "ఆ పండ్లూ అవీ తీసుకెళ్ళాలి" అన్నాడు.

"అవి ఎందుకూ?"

"తీసుకెళ్ళాలి. ఇది ఒక సరదా-ప్రతిదాన్నీ ఎందుకూ అని ప్రశ్నించరాదు."

"ఎందుచేత ప్రశ్నించరాదు?"

"ఎందుచేతనా?" అంటూ అలీ ఆపండ్ల పళ్లెం ఎత్తి, పక్కనున్న సంచీలో అవన్నీ పడేసి, ఆపళ్లెంలోని తాంబూలంలోనుంచి ఒక వంద రూపాయల నోటుతీసి శాస్త్రి జేబులో పడేశాడు.

"ఇదేమిటి?" అన్నాడు శాస్త్రి. "ఏం లేదు. శశీ, నువ్వూ ఇప్పుడు ఎలా ఉన్నారో నాకు తెలుసు. డబ్బు కావల్సినప్పుడల్లా నేనున్నా లేకపోయినా బిజిలీకి చెప్పు. తప్పక తెచ్చిస్తుంది. మొహమాటం వద్దు..." అని సాగనంపాడు అలీ.

* * *

ఆరోజు ఆదివారం. శాస్త్రి గదులో కూర్చుని బొమ్మ వేసుకుంటున్నాడు. శశి ఇంట్లో లేదు. అప్పటికి రెండు నెలలనుంచీ ఒక భాగ్యవంతుని భార్యకు సంగీతం చెపుతున్నానని శశి చెపుతోంది. ప్రతినెలా ముప్ఫయిరూపాయలు తెస్తోంది. వేడి నీళ్ళకు చన్నీళ్లతోడై జీవితం రెండెడ్ల బండికి మల్లే సాగిపోతోంది.

ఇంతలో శశి కాలిన చేతితో ఇంట్లో ప్రవేశించింది. ఆమె ఎంతగా ఆపుకుందామని ప్రయత్నించినా బాధ ఆగలేదు. కనుక సహించలేక నెమ్మదిగా "అబ్బా..." అన్నది. ఆ మూలుగు ఒక సన్నని అంబులాగ పోయి దాదాపు ఈ ప్రపంచాన్నే మరచివున్న శాస్త్రి గుండెకి తగిలింది. కుంచె చేతిలోంచి అతనికి తెలియకుండానే జారిపోయింది.

"ఏమిటి శశీ!" అంటూ ఒక పరుగున పోయి శశి దగ్గర నిలబడ్డాడు

"ఏమీ లేదు..."

"ఏమీ లేకపోవడ మేమిటి, చెయ్యి ఆ విధంగా మాడిపోలేను?"

"దానికేం గాని... ఇవాళ ప్రొద్దున నువ్వు జమీందార్ అలీగారింటికి ఎందుకు వచ్చావు?"

"ఏం... లేదు... వాళ్ల ఇంట్లో వంటచేసే సంగీత విద్వాంసురాలి చెయ్యి కాలితేనూ..."

"ఓ, అదా... వాళ్ళ బిజిలీ కేటగా నువ్వు ప్రతినెలా వందరూపాయిలకి బొమ్మ లమ్ముతున్నదీ..."

ఇద్దరూ పొట్ట చెక్క లయేటట్లు నవ్వుకున్నారు. ఆహా, కళాభంగిమ!


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

**మెహతావారి**
**విశేష ఔషధములు**

1. సుందరి ఎలిగ్జిర్ :—సమస్త ఋతు దోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :—సాధారణబలహీనత, కీళ్లనొప్పులు, జ్వరము లన్నిటికీ అమోఘముగా పనిచేయును.
4. ద్రాక్షాసవము :-(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధి పరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టు లందరివద్ద దొరకును.

తయారు చేయువారు:

**K. S. MEHTA & CO.**
**250, China Bazar, Madras.**